
సాహిత్యశీర్షిక



# ఘన్నమావి

## డాక్టర్ లంకిపల్లె


ఉదయం వెలుగుతో నిద్రాణమైన ప్రకృతి జాగృతమవుతూ ఉంది. వెలుగుతో పాటు బస్సు వెళ్తూ ఉంది. పల్లెలు గుట్టలు. మిట్ట - పల్లాలు, చెట్లు చేమలు దాటి అతుకుల బొంతలా వుంది గతుకులరోడ్డు.

మనిషిలో మంచి చెడుల్లా వెలుగు నిడలు!

మిట్ట పల్లాలు అక్కడి ప్రజల జీవితానికి ప్రతి బింబాలు. మంచుకు తడిసి, చలికి ముడుచుకు పోయిన ప్రకృతి లేఎండ పులకరింపుతో తడి తడిగా మెరుస్తూ సౌందర్యాన్ని సంతరించు కొంటూ ఉంది. ప్రతి అణువులో ప్రత్యేకత కన్ను తెరుస్తూ ఉంది. చలి ముసుగు నుండి బయట పడిన జడ ప్రకృతిలో చేతన వెలుగై కదులుతూ ఉంది. మైమరపించే సుప్రభాత సందర్శనం!

బస్సు ఆగిన కుదుపుతో నిశ్చలంగా ప్రకృతి దృశ్యాలు చూస్తున్న వసంతకుమార్‌లో కదలిక వచ్చింది. అతని ప్రక్కన నిద్రపోతున్న రైతు తూలి మత్తుగా కళ్లు తెరిచాడు.

"శాంతి పురం ఎంత దూరం?"



దశాబ్దాలు గడిచే కొద్దీ రాజకీయ, వైజ్ఞానిక, సామాజిక రంగాలన్నింటి పరివర్తనలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ మార్పులన్నీ మనిషి జీవనగతిపై ఆలోచనా రీతిపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి.

సమాజంలో, మానవ జీవితంలో వచ్చిన మార్పులే రచయితల భావసరళిని, ఆలోచనా శక్తిని ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం మారుతుంది. సమస్యల స్వరూపం మారుతుంది. రచనా సంవిధానం మారుతుంది. ఏది మారినా మౌలికమైన సాహిత్యపు విలువలు, జీవితపు విలువలు మారవు. మారని ఈ విలువలున్న కథైనా, నవలైనా మరే ఇతర రచనైనా అది ఈతరం రచయిత రచించినదైనాగానీ సాహిత్యాభిమానుల ఆదరణను చూరగొంటుంది. కాలాతీతమైన విలువల్ని ఆవిష్కరిస్తుంది. అందులో సందేహం లేదు.

ఈ విలువల్ని ఎత్తిచూపే ప్రయత్నంలో భాగంగా ఈనాటి కథకుల విలువైన రచనల్ని ఆహ్వానం మీకు అందిస్తోంది.

---

మెల్లగా అడిగాడు వసంతకుమార్

"శాంతిపురమా! ------- ఇంకా చాల దూరం! -----"

ఆపుకోలేని ఆవులింతతో రైతు కళ్లు మూతలు పడ్డాయి.

వసంతకుమార్ లో సుకుమారత్వం ఉంది, నాజూకు తనం ఉంది. అందుకే వసంతకుమార్ చిన్నప్పటి నుండి ఇంటా బయటా 'వసంత' గా పిలవబడుతున్నాడు. బస్సు దిగిన వసంత శాంతిపురం రోడ్డున నడిచాడు. అతని నడకలో ప్రత్యేకత ఉంది. అది అందమైన అమ్మాయి నాట్యం లాంటి నడక!

వసంతకు సన్నగా నవ్వు వచ్చింది. అసలు తను శాంతిపురం ఎందుకు వెళ్తున్నట్లు?! అతనికి బహుశా ఎండమావి వెంట వెళ్తున్నానేమో, అన్న సందేహం వచ్చింది; నడక వేగం తగ్గింది. నీరెండ చురుగ్గా తగిలింది. చెట్టునీడన విల్చున్నాడు. సగం ఎండిపోయిన మామిడి తోపును కొట్టిమోపుల కట్టి మోసుకెళ్తున్న జనం కనిపించారు. సాహిత్యంలో త్యాగధనుడికి మామిడి చెట్టుకు సారూప్యత ఉంది. సుమారు పాతికేళ్లు కాటకాలను ఎదురొడ్డి నిలువ గలిగిన చెట్టు మామిడి. చెట్టునాటి, ప్రాదిచేసి, నీరుపోసి మూడు సంవత్సరాలు పెంచితే కాపుకొస్తుంది. అటు తరువాత ప్రతి సంవత్సరం దున్ని కంచె వేస్తే తోపు నిలకడైన కాత కాస్తుంది. రైతుకు ఎక్కువ కష్టం లేని సేద్యం మామిడితోట పెంపకం.

చిన్నప్పుడు మామిడితోటలో ఆడిపాడిన అనుభూతి కదిలింది వసంతలో. తియ్యటి అనుభూతులే కాదు, చేదు నిజాలు కూడా ఉన్నాయి. మామిడి పంట బాగా వచ్చిన సంవత్సరం ధరలేక పంట నేల పాలయ్యేది. పురుగులు పడిన పండ్లు చెట్లనుండి రాలేవి. ఇది ఎన్నో మార్లు వసంత కళ్లార చూచి చలించిన దృశ్యం. మామిడి పంటను మట్టిపాలు కాకుండా చేయలేమా? - సహజ సంపద సద్వినియోగమైనప్పుడే అసలు ప్రగతి - ఇది వసంతకు చిన్నవయస్సులో కలిగిన ఆలోచన. అతనితో పాటు ఆలోచన కూడా పెరిగింది. ప్రవాసంలో పండ్ల పరిశ్రమకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానం ధనసంపత్తి కూడబెట్టాడు. ఆత్మస్థైర్యంతో తిరిగివచ్చిన వసంతకు నీలాలు పారే మామిడి తోపులు కన్పడలేదు. చాలవరకు ఎండి శిథిలమయ్యాయి. అక్కడక్కడ ఎండిపోయిన చెట్లతో పలచబడిన తోపులున్నా, అవి ఐదునుండి పది సంవత్సరాలకు లీజుకు తీసుకొన్న వ్యాపారస్తుల స్వాధీనంలో ఉన్నాయి. పండ్ల రసం ఫ్యాక్టరీలు పెట్టిన పెట్టుబడిదారులు కోటీశ్వరులవుతున్నారు. వ్యాపారస్తులు లక్షలార్జిస్తున్నారు. రైతాంగానికి వ్యాపారం చేసే నేర్పు లేదు. పెట్టుబడి పెట్టే ఆర్థిక స్తోమత లేదు. అందుకే వారి బతుకులు ఎక్కడ విడిచిన గొంగళి అక్కడే -- నిరాశ, నిస్పృహలతో వసంత వట్టిపోయిన కొలనులా మారాడు. అతనిలో ఊరిన ప్రణాళికా రూపాలకు పురిట్లోనే సంధి కొట్టినట్లుంది.

* * *

వసంత నడక సాగించాడు. శాంతిపురం ఊరు ముందర అతన్ని కుక్కలు చుట్టుముట్టాయి. వాటిబారి నుండి ఒక పెద్దాయన తప్పించాడు. తెల్లదొర దారితప్పి ఇట్లా ఎందుకొచ్చినట్లు?! నోరు తెరచి చూశాడు పెద్దాయన. వసంత పోస్టాఫీసు బోర్డు చూచి అక్కడికెళ్లాడు. ముగ్గురు వార్తాపత్రిక చదువుతున్నారు. ఉత్తరాల అడ్రస్సులు జాగ్రత్తగా పరిశీలిస్తున్న వ్యక్తి వసంతను చూశాడు.

"ఏమండీ, ఇక్కడ సుప్రభ ఇల్లు ఎక్కడ?"

అడ్రస్సులు చూస్తున్న వ్యక్తి కనుబొమ్మలు చిట్లించాడు.

"మీ పేరు?"

"వసంతకుమార్"

'ఓ' అన్నాడేదో గుర్తు చేసుకొంటూ. తన జవాబు కోసం ఎదురు చూస్తున్న వసంతను పరిశీలనగా చూశాడు. అతనికి చాల బేలగా కన్పడ్డాడు వసంత.

"సుప్రభకి నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. ఇద్దరు పిల్లలు." వసంత మనస్సు పూర్తిగా నిరాశతో నిండిపోయింది. ఇక ఆమె వివరాలడగాలనిపించలేదు. స్నేహ వారధి కూలిపోయింది. మెల్లగా వెనుతిరిగి నిదానంగా అడుగులు వేశాడు. అప్రయత్నంగానే వేగం హెచ్చింది. అతనికి దప్పిగా ఉంది; కాని నీళ్లు తాగాలని లేదు. వసంత మనస్సు కల్లోలితమయింది. అది చివరి ఎదురు దెబ్బలా ఉంది. ప్రేమ దగా! విషాదపు నవ్వుతో బాధను అణగపట్టి నడిచాడు వసంత. భగ్న హృదయం భగ్గున మండినట్లుంది. గతం కదిలింది.

* * *

వసంత యూనివర్శిటీలో చదివే రోజుల్లో సుప్రభతో పరిచయం కలిగింది. పరిచయము ప్రేమగా మారింది. ఆమె మాటల్లో మాధుర్యం, చూపుల్లో వలపు చిలిపితనానికి మంత్రముగ్ధుడు వసంత! అటు తర్వాత వసంత ఏడు సంవత్సరాలు అమెరికాలో గడిపాడు.. మాతృదేశంపై మమకారం అప్పుడప్పుడూ పెనవేస్తూ ఉండేది.

పుట్టి పెరిగిన ఊరు, కాలేజీ జీవితం తీపి అనుభూతులు మనసులో సుళ్లు తిరిగేవి. తల్లిదండ్రులపై మమకారం కలవర పెట్టేది. ఇద్దరు తమ్ముళ్లు ఆప్యాయంగా రాసే జాబులు ఆలోచనలు రేకెత్తించేవి.

ఉత్తరాలు కవ్విస్తూ రాసేది సుప్రభ. జాబులు ఆలస్యంగా అందుతున్నాయని ఆమె కోపటపాకాయలు పేల్చేది; ప్రేమ వెన్నముద్దలు వెలిగించేది. అన్నిటిని ప్రక్కకు నెట్టి దీక్షతో పనిచేశాడు. చదువు పూర్తి చేసి అక్కడే ఉద్యోగంలో చేరాడు. తమ్ముళ్లకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని భూములు కొనటానికి డబ్బు పంపాడు.

కాని కొంతకాలానికి వారు డబ్బు కోసం చూపే కారణాలు అర్థం పర్థం లేనివిగా తోచాయి. వారికి డబ్బు పంపటం మానేశాడు. వారి వద్ద నుండి జాబులు ఆగిపోయాయి. ఎందుకోమరి సుప్రభ నుండి కూడా జాబులు ఆగిపోయాయి. ఎన్ని ఉత్తరాలు రాసినా బదులు లేదు. ఏం జరిగిందీ అర్థం కాలేదు వసంతకు.

వసంత కొండంత మమకారంతో, ఆశలతో, ఆశయాలతో అమెరికా నుండి ఊరికి వచ్చాడు. అతనికి ఊరి పరిస్థితులు తారుమారుగా తోచాయి. దేశంలో మారుతున్న సామాజిక రాజకీయ వాతావరణం పరిశీలిస్తే ఏదో లోపం కొట్టవచ్చినట్లు కన్పడింది. సమిష్టి గ్రామీణ, ప్రశాంత జీవనం కలుషితమై తీవ్రంగా గాయపడింది. సుహృద్భావ సమిష్టి జీవితం కుంటు పడింది. రాక్షస రాజకీయ క్రీనీడ పల్లెపై పడింది.

వసంత తమ్ముళ్లిద్దరికి పెళ్లిళ్లయ్యాయి. సంసారాలు సాగిస్తున్నారు. ఒక తమ్ముడు 'సర్పంచ్' గా రాజకీయాల్లో మునిగి తేలుతున్నాడు. మరొకడు చిన్న చిన్న కాంట్రాక్టులతో లాభాలు లేని వ్యాపారం చేస్తున్నాడు.




సేద్యం కూలీలకు అప్పగించారు. సేద్యం దారి సేద్యంది! పొయ్యిలో తంగేడు కట్టెలు, పొయ్యిమీద అంగట్లో బియ్యం! తల్లి, తండ్రి అదేదో పెద్ద హోదాగా డాంబికంగా బ్రతుకుతున్నారు! వసంతకు మరీ వింతగా కన్పడిన విషయం వారందరు అతన్నొక డబ్బు సంపాదించే యంత్రంగా పరిగణించటం! ఎవరు కాని అతని మంచి చెడ్డల గురించి విచారించలేదు. సాధక బాధకాలను గురించి అడగలేదు. అతన్ని కృత్రిమ గౌరవభావంతో చూశారు. ఎంతసేపూ అతను ఎంత సంపాదించాడు, అది ఎప్పుడిస్తాడనే చూపే! వారిలో తమకు తాముగా కష్టపడి సంపాదించాలనే భావం ఎక్కడా కన్పడలేదు. వసంతకు ఎంతో బాధ కలిగింది. ఆత్మీయుల దగ్గర కొచ్చి దూరమయ్యాడు. అనుబంధాలకు అర్థాలు మారినట్లనిపించింది.

అనంతంగా పేరుకుపోయిన నిరాశతో ఊరు వదలాలనే నిర్ణయాని కొచ్చాడు వసంత. ఎక్కడి కెళ్లాలి? ఎక్కడ ప్రతిభకు గుర్తింపు ఉందో, ఎక్కడ శ్రమకు తగ్గ ప్రతిఫలం ఉందో అక్కడికి!

వసంత అమెరికాకు శాశ్వతంగా వెళ్లే ముందు చివరిగా అతనిలో గూడుకట్టుకొన్న కోరికను త్రోసిపుచ్చ లేకపోయాడు. అది సుప్రభను చూడాలనే కోరిక. ప్రేమ పాశం ప్రయాణానికి బంధం వేసింది. ఆమె అతని కోసం ఎదురు చూస్తూంటుందన్న నమ్మకం లేదు. కానీ ఏదో ఆశ! అతని మనసు నిండా ఆలోచనల ఎండ! సుప్రభ సుఖంగా ఉంటే చాలు. వసంతలో స్నేహ సుగంధం పరిమళించింది. శాంతి పురం వచ్చాడు. విన్న వార్తతో నిర్వేదం విషంలా ప్రాకుతూ వుంది. అశాంతితో నిద్రలో నడుస్తున్నట్లుంది! మమత, అనురాగాలు ఆరిపోయినట్లనిపించింది. విరక్తి కలిగింది.

* * *

అతని కంటే ముందు కదిలే అతని నీడను తొక్కుకుంటూ నడుస్తున్నాడు వసంత. దూరంగా ఎవరో పిలుస్తున్న శబ్దం విన్పడింది. అప్రయత్నంగా అటు చూశాడు. చేయూపుతూ స్త్రీ! ఆమె పరుగు నడకతో వస్తూ ఉంది. ఆశ్చర్య సంభ్రమాలతో చూశాడు, వసంత కళ్లు నమ్మలేనంత సత్యం! చిరునవ్వుతో సుప్రభ వచ్చింది.

"ఏమిటీ! వచ్చీ రాకనే తిరిగెళ్తున్నారు! వస్తున్నట్లు జాబులేదు!" ఆమె సంతోషం శిఖరాగ్రం పై తేలిపోతున్నట్లుంది. వసంత చిరునవ్వు నవ్వాడు. చిగురు మొలకెత్తిన మామిడి రెమ్మలా ఉంది సుప్రభ ముఖం.

"మీరు ఊర్లోకి వెళ్తున్నప్పుడు అదృష్టం కొద్ది ఇటు చూసి మీ నడక గుర్తించి వచ్చాను." అందులో ఆప్యాయత ఉంది, హాస్యం ఉంది. నిశ్చలంగా ఆమెను చూస్తూ నిలుచున్నాడు వసంత. పైట బిగించిన ఆమె నిండుగా ఉంది. ఆమెలో ఒకనాటి నాజూకుతనం లేదు, చలాకితనం లేదు; చిలిపితనం లేదు. మోడుబారిన పూలమొక్కలా వుంది. "ఏమిటి, అలా చూస్తూ నిలుచున్నారు! మాటలు మరచి పోయారా! ----- సరే! రండి!"

సుప్రభ వసంత చేతి నుండి ఏర్‌బాగ్ లాక్కొని నడిచింది. వసంత మధురమైన కలలో నడచినట్లు ఆమెననుసరించాడు. అంతవరకు పోస్టాఫీసులో గలగల మంటున్న నవ్వలాగిపోయాయి. వీథిలో ఊరిజనం తల వంచుకొని నడుస్తున్న వసంతను వింతగా చూశారు.

సుప్రభ వసంతకు క్షణాల మీద స్నానానికి ఏర్పాటు చేసింది. టిఫిన్ పెట్టింది. ఆమె అమ్మ, నాన్నలకు వసంతను పరిచయం చేసింది. సుప్రభ తల్లి బాగా పండి వాడిన మామిడి పండులా ఉంది. ఆమె తండ్రికి ఒక కాలు చేయి సరిగా ఆడటం లేదు. సగం ఎండిన ముదురు మామిడి మొదల్లా ఉన్నాడు. వారి ముఖాలలో సంతోషం తాండవిస్తూ ఉంది.

అధునాతన నమూనాతో కట్టిన ఇల్లు అందంగా, శుభ్రంగా ఉంది. అన్ని సౌకర్యాలతో మిద్దె మీద ఉన్న ఒక గదిలో వసంతను విశ్రాంతి తీసుకోమని చెప్పింది సుప్రభ.


పదిరోజులు ఎడారిలో నడచినంతగా మానసికంగా అలసిపోయిన వసంతకు, ఇప్పుడు 'ఒయాసిస్' ను చూసినట్లు మనస్సు ప్రశాంతంగా ఉంది. వళ్లు తెలియని నిద్ర ముంచుకొచ్చింది. మధ్యాహ్నమయినా లేవలేదు. సుప్రభ మృదువుగా పిలిచింది. మెల్లగా తట్టిలేపింది.

"భోజనం చేయరా?"

"అక్కర్లేదు - అమెరికాలో అమృతం తాగి వచ్చాను."

ఆమె కోపంగా చూసింది. చిరుకోపంలో మరింత అందంగా వుంది.

డైనింగ్ టేబుల్ మీద వంటకాలు చూసి వసంతకు నోరూరింది. సుప్రభ భోజనం కలిపి ముద్దలు చేసి తండ్రి చేతిలో పెట్టింది. అతను నెమ్మదిగా పూర్తిగా సహకరించని చేత్తో అన్నం ముద్దలు తిన్నాడు. తండ్రికి వేళకు అన్నం ముద్దలు పెట్టటం ఆమెకు ఆనందం. సుప్రభ తల్లి కొద్ది కొద్దిగా మజ్జిగ అన్నం తిన్నది.




వయసు మళ్లిన తల్లితండ్రులకు మమత నిండిన బిడ్డే తల్లి, తండ్రి!

వసంత భోజనం చేసి మరలా నిద్రపోయాడు. సాయంత్రం మూడు గంటలకు నిద్ర లేచాడు. టిఫిన్, కాఫీ మేడపైకి తీసుకొచ్చింది సుప్రభ. వసంత కొసరి, కొసరి పెట్టింది. మొహమోటంతో ఎక్కువగానే తిన్నాడు.

"మడి దగ్గర కూలి వాళ్లు పనిచేస్తున్నారు. వెళ్లి రావాలి."

వసంతను చూస్తూ మందహాసంతో చెప్పింది సుప్రభ.

"సేద్యం పనులు చేయటం కూడా వచ్చా!"

నవ్వింది సుప్రభ. ఆమె వెంట మడి వైపు నడిచాడు వసంత. గత పదిరోజుల అనుభవాన్ని దట్టమైన పొగమంచులో కూరుక పోయినట్లు బరువుగా, బాధగా చెప్పాడు వసంత. సుప్రభ తేలిగ్గా, చిరునవ్వు నవ్వింది.

* * *

"మీ అన్నయ్య బాగున్నారా?"

ఏం చెప్పాలో అర్థం కాలేదు, సుప్రభకు.

"తెలియదు."

"అంటే"

"కథ చెప్పనా?"

నవ్వాడు వసంత. ఆనవ్వులో ఆత్మీయత ఉంది. నెమ్మదిగా చెప్పింది. "వదినకు పల్లె అంటే అయిష్టత. ఒక మారు అన్నయ్య లక్ష రూపాయిలు కావాలని నాన్ననడిగాడు. పెద్ద ఇల్లు కట్టాము కదా, ఇక డబ్బు ఎక్కడిది? అన్నాడు నాన్న. ఈ పల్లెలో ఇంత ఇల్లు ఎందుకు కట్టినట్లు? -- ఎదురు ప్రశ్న వేశాడు. అన్నయ్య. అంతే మాటా మాటా బెడిసింది. తన భాగం పంచి ఇమ్మన్నాడు అన్నయ్య. అది

> రాజకీయం లేని చోటు లేదు. రాజకీయం పవిత్రం కాదు. జనంలో రాక్షస ప్రవృత్తి వుంది. అలజడి వుంది. అశాంతి పెరిగింది. గమ్యం లేని ప్రయాణం! అయితే రాక్షసత్వంలో మానవత్వం పూర్తిగా చావలేదు. అశాంతి అలల మాటున శాంతి వుంది. చీకటి కడుపున వెలుగు వుంది. సంధి యుగంలో వాటి సమన్వయం కుదురలేదు! అంతా గజిబిజి బొమ్మలా వుంది! -
> తరతరాల సజీవ సంస్కృతి వారసత్వంతో చిగురించే మానవ విలువలు వున్నాయి. మనిషికి మనిషికి మధ్య అనుబంధం వుంది. అనురాగం వుంది. ఒక వైపు మామిడితోపు ఎండి శిథిలమవుతూ వుంది. మరోవైపు గున్నమామిడి పూతతో శృంగారంగా వుంది

నాన్న ఊహించని మలుపు. నాన్న దిగ్భ్రాంతి నుండి తేరుకొనే లోపల వదిన వాదన అందుకొన్నది. మరి మాట్లాడలేదు నాన్న. ఇల్లు పద్నాలుగు ఎకరాల మడి వదిలేసి మిగత తన భాగంగా ఎనిమిదెకరాల మామిడితోపు, పల్లపు మడి కావాలన్నాడు, అన్నయ్య. నాన్న అడ్డు చెప్పలేదు. వారం రోజుల్లో భాగ పరిష్కారం జరిగిపోయింది.

అనుబంధాలు తెగతెంపులు చేసుకొని పట్టణం వెళ్లిపోయాడు అన్నయ్య. మానసిక క్షోభతో క్రుంగిపోయాడు నాన్న. ఊర్లో పాత విరోధులు అదనుచూసి కక్ష సాధించారు. పట్టుతప్పిన నాన్న పక్షవాతంతో ఇల్లు వదలి బయటకు నడవలేని స్థితికి వచ్చాడు.

సంవత్సరం తిరక్కముందే పల్లపుమడి అమ్మేశాడు, అన్నయ్య, మామిడితోపు లక్ష రూపాయలకు ఆరేండ్లకు లీజుకు పెట్టాడు. తోపు లీజుకు తీసుకొన్నవారు తమ లాభాలు రెట్టింపు చేసుకోవటానికి మోతాదుకు మించి మందులు కొట్టి దిగుబడి ఇనుమడింపచేసుకొన్నారు. ఇంతలో చిన్న కరవు వచ్చింది. నందనవనంలా ఉండే తోపు ఎండిపోయి, కొల్లపోయింది. ఇప్పుడు అది కూడా అమ్మేస్తానంటున్నాడట, అన్నయ్య. కాని కొనేవాళ్లు లేరు".

* * *

కొత్తగా పెట్టిన మామిడితోపు గేటు తీసింది సుప్రభ. కంచె దట్టంగా చీమ దూరటానికి సందు లేనట్లుంది. తోట చుట్టూ టెంకాయ చెట్లు కాపలా కాసే సిపాయిల్లా ఉన్నాయి. గుబురు పొదల్లా ఉన్నాయి మామిడిచెట్లు. సుప్రభ వసంతకు పలురకాల చెట్లను గురించి చెప్పింది. నీళ్లుపారే మామిడిచెట్లు చిగురాకులతో, పూతతో నిండుగా కళకళలాడుతున్నాయి. తోపు చుట్టు కల్లవేస్తున్న కూలీలు చిరునవ్వుతో సుప్రభను పలుకరించారు. వసంతను విచిత్రంగా చూశారు. కూలీలు స్టోర్లో బియ్యం వచ్చాయని ఆలస్యమైతే మరి దొరకవని వెళ్లిపోయారు. వాతావరణం ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉంది. గుబురు నీలం చెట్టు క్రింద సిమెంటు పలక మీద కూచున్నారు సుప్రభ, వసంత. "అమెరికాలో అమృతం తాగానన్నారు ------- మరి ఒంటరిగా వచ్చారే?" వ్యంగ్యంగా ఉంది సుప్రభ ప్రశ్న. మందహాసం చేశాడు వసంత. ఓరగా చూసింది సుప్రభ. ఆమెలో ఏమూలో లేశమంత శంక కొండంత వెలుగులో గోరంత చీకటిలా ఉంది. ఆ చీకటిని తొందరగా తుడిచి పెట్టాలని ఆమె తాపత్రయం!

"ఎందుకు జాబులు రాయలేదు?"

సంజాయిషీ అడుగుతున్నట్లు ప్రశ్నించింది సుప్రభ.

"ఉత్తరాలు ఎవరు రాయుంది! నువ్వా, నేనా?"

ఇద్దరిలోను కోపం ఉంది; ఉక్రోషం ఉంది; బాధ ఉంది.

"మరి మన ఉత్తరాలేమైనట్లు?"

అర్థం కానట్లు చూసింది సుప్రభ. దీర్ఘంగా క్షణం ఆలోచించాడు వసంత. అతనికి పోస్టాఫీసులో నవ్వులు గుర్తుకొచ్చాయి.

"బకాసురుడులా మన జాబులను మీ పోస్టు మాస్టరు మింగేసి ఉంటాడు." విషాదంగా మారింది సుప్రభ. విచారంతో వాడిన



4-A

మందారంలా మారింది ముఖం.

"అతనికి మా నాన్నకు విరోధం; అదను చూచి కాటేశాడు!" మనుషుల్లో మిన్నాగుల విషం వుందని తెలిసింది. సుప్రభకు బాధతో నిట్టూర్చింది. ఆమె వళ్లు జలదరించింది. త్రుటిలో ఎంత ప్రమాదం తప్పింది.

పల్లెను ప్రపంచముతో ఉత్తరాల ద్వారా కలిపేది పోస్టాఫీసు. పోస్టాఫీసుకు కూడా గ్రామ కక్షల గ్రహణం తప్పలేదు! తిట్టకుండా, కొట్టకుండా పచ్చని జీవితాలను భగ్గున మండించే కార్పణ్యం మనిషిలో ఎందుకు పేరుకు పోతూ ఉంది? -- ఇది ఆమె మనసు ప్రశ్న. జవాబు ఆమె ఊహ కందనిది. దేశానికి ఆయువు పట్టు పల్లె. పల్లెల ప్రగతి ఎలా సాగుతూ వుంది? నిట్టూర్చింది సుప్రభ!

సుప్రభ సింమెంటు పలక మీద కూచొని పడమటి సంధ్యారాగాన్ని చూస్తూ ఉంది. కదిలే తెల్లని మేఘం సింధూరపు రంగుతో తడిసినట్లుంది.

ఎందరో విదేశాలకు వెళ్లినవారు. తిరిగి స్వదేశం వచ్చిన వారి కంటే అక్కడ స్థిరపడిన వారే ఎక్కువ. మేధావి వర్గం తమ తెలివి తేటల పంట పండించటానికి అనుకూల వాతావరణం శ్రమకు తగ్గ గుర్తింపు వుంది. పనికొద్ది సంపద పెరుగుతుంది. పెరిగిన సంపదతో సుఖాల ఊయల! స్వదేశాగమన కార్యక్రమానికి భరతవాక్యం! -- ఎవరైనా తిరిగివచ్చినా ఇక్కడ పరిస్థితుల పద్మవ్యూహం ఛేదించలేక అస్త్ర సన్యాసం చేసినవారే! సుప్రభకు వసంత నిర్మలమైన మనసు అర్థమయింది. ఆమె గుండె ప్రేమ చెరువు అయింది. రాగరంజిత మనసుతో పులకింత కలిగింది. వేయికళ్లతో ఎదురు చూచిన వసంతం కళ్లెదుట కదిలినట్లుంది.

సుప్రభ పెంచిన మామిడితోటలో ఉత్సాహంగా తిరుగుతున్నాడు వసంత. ప్రతి చెట్టు ఆమె శ్రద్ధకు, కృషికి నిదర్శనంగా ఉన్నాయి. ప్రేమకు ఆటంకం కలిగినా, అన్ని బాధ్యతలు విస్మరించినా, నాన్న అవిటివాడైనా, అమ్మ దిగులుతో దిగజారినా, పరిస్థితులు వికటించినా వెనుకంజవేయక ఆత్మవిశ్వాసంతో సుప్రభ నడచిన దారి వెలుగు బాటలో తోచింది.

భౌగోళికంగా ఏ దేశానికి సంబంధించిన సహజ సంపద ఆదేశానికి ఉంది. మౌలికంగా అది మార్పు చెందదు. కాని మనిషి ఆలోచనతో, విజ్ఞానంతో, కృషితో సంపద పెరుగుతుంది. ఇది వసంత ఆలోచన. చేతన నాడి స్పందన ఉన్న మనిషికి సోమరితనం పులిమినా అంటదు; ఆలోచన ఆగదు.

కాలం ఆగని స్రవంతి. ఒక చోట కాలుష్యం వుంటుంది. ఒకచోట ఎడారి. ఎన్నో మలుపులు. అన్నిటిని దాటి కదులుతూ వుంది కాలం. మంచి చెడులు అన్నీ అందులో భాగమే! ఒక్క క్షణంలో జీవితానికి అర్థాలే మారిపోయాయి అనిపించింది వసంతకు.

రాజకీయం లేనిచోటు లేదు. రాజకీయం పవిత్రం కాదు. జనంలో రాక్షస ప్రవృత్తి వుంది. అలజడి వుంది. అశాంతి పెరిగింది. గమ్యంలేని ప్రయాణం! అయితే రాక్షసత్వంలో మానవత్వం పూర్తిగా చావలేదు. అశాంతి అలల మాటున శాంతి వుంది. చీకటి కడుపున వెలుగు వుంది. సంధి యుగంలో వాటి సమన్వయం కుదరలేదు! అంతా గజిబిజి బొమ్మలా వుంది! •

తరతరాల సజీవసంస్కృతి వారసత్వంతో చిగురించే మానవ విలువలు ఉన్నాయి. మనిషికి మనిషికి • మధ్య అనుబంధం ఉంది. అనురాగం వుంది. ఒక వైపు మామిడితోపు ఎండి శిథిలమవుతూ వుంది. మరో వైపు గున్న మామిడి పూతతో శృంగారంగా వుంది.

సుప్రభ కూచున్న చోటికి తిరిగివచ్చాడు వసంత. సుప్రభ శిశిరం వదలి హేమంతలో అడుగిడుతున్న పూలమొక్కలా వుంది! గుబురు మామిడి కొమ్మ మీద కనుపించని కోయిల ఋతురాజుకు స్వాగత గీతం ఆలాపించింది.

*




Estd. 1952 Phone : 3469

L.I.C.EMPLOYEES' CO-OPERATIVE BANK LTD.,

Regd. No. 15 NN. MACHILIPATNAM

Our attractive rates of Interest on Term Deposits :

(a) 46 days and above but less than 6 months 11%

(b) 6 months and above but less than 1 year 11.25%

(c) 1 Year and above 11.5%

"SERVICE IS OUR MOTTO"

C.H. MAHADEVAN
Ex-Officio President

T.L.R.PRASADA RAO
Vice-President

D.S.PRAKASA RAO
Treasurer

BOARD OF DIRECTORS

Y.P. Vithal
Guttikonda Subba Rao
M.Poornachandra Rao
V.V.Panduranga Rao
B.A.Prasad
V.Koteswara Rao

P.B.R.V.PRASADA RAO
Secretary-in-charge